శని దేవతలు!!

సుజనశ్రీ

ఇనుప గేటుని తోసుకుంటూ లోపలికి ప్రవేశించింది సరళ. ఆ భవనం మొదటి చూపులోనే ఆమెను ఆకట్టుకుంది.

బహుశా దాని యజమాని లక్షలకు అధికారి అయివుండాలి. లేకపోతే ఇద్దరు నర్సుల్ని ఇంటికి పిలుచుకోగలుగుతాడా?

ఈసరికి మరో నర్స్ కోమలి వచ్చేసి ఉండాలి అనుకుంది సరళ.

ఆ భవనం యజమాని పరాత్పరరావుకి ఫామిలీ డాక్టరు శేఖరం. అతడే మిషన్ హాస్పిటల్‌కి ఫోన్ చేశాడు, ఒక రోగికి సపర్యలు చేసేందుకు ఇద్దరు నర్సుల్ని పంపమని. అందుకయ్యే ఖర్చులో కొంతభాగం అడ్వాన్సుగానే చెల్లించేశాడు మిషన్ హాస్పిటల్ అధికారులకు.

హాల్లో సరళకు కోమల కనిపించింది. కోమలి తనకన్న కొద్దిక్షణాల ముందే వచ్చి వుండాలి. ఇంకా ఆమె లగేజీ అక్కడే వుంది. ఎదురుగా పనిమనిషి సుబ్బులు నిలబడి వుంది.

"సుబ్బులూ! ఆయనగారి కెలా వుంది?" కోమలి ఆత్రంగా అడుగుతోంది.

అయితే ఎదురుగా వున్న సుబ్బులు కోమలివంక కొరకొరా చూస్తోంది.

"నువ్వా? మళ్ళా ఏ ముఖం పెట్టుకుని ఇక్కడకు వచ్చావ్?" అని ఉరిమినట్టుగా అడుగుతోంది.

వాళ్ళ సంభాషణలోని ఆంతర్యం సరళ కేమాత్రం అర్థం కాలేదు.

"ఏమిటి నీ వాగుడు! నేనెవరనుకున్నావ్! రోగికి సపర్యలు చేయడానికి వచ్చిన నర్స్‌ని. ఏ గదిలో ఉన్నారు ఆయన!" పులిలా గర్జించింది కోమలి.

మెట్లమీదనుంచి పిల్లిపిల్ల వచ్చింది. అది కోమలిని చూస్తూనే పరుగెత్తుకుంటూ వచ్చింది. కోమలి దాన్ని ఆప్యాయంగా నిమిరింది.

"చూశావా? ఆఖరికి ఇదిగూడ నన్ను మరిచిపోలేదు" అంది కోమలి.

సుబ్బులు అసూయగా చూసింది.

అంటే కోమలికీ ఈ ఇంటికీ ఇంతకుపూర్వమే ఏదో అనుబంధం వుందన్నమాట, అనుకుంది సరళ.

పిల్లిని సోఫాలో దించి కోమలి మేడమెట్లెక్కింది. ఆ భవనం ఆమెకు చిరపరిచితమల్లే వుంది చకచక నడిచి పైకె వెళ్ళింది.

ఆమె వెళ్ళినవంకే చూస్తూండిపోయింది సుబ్బులు. మధ్య మధ్యలో "ఔరా!" అని బుగ్గలు నొక్కుకుంటోంది.

"చూడమ్మా! ఈ ఇంట్లో లక్ష్మణరావనే ఆయనకు అస్వస్థగా ఉందటగదా! ఆయనను ఇరవయ్ నాలుగు గంటలూ కనిపెట్టుకుని ఉండగలందులకు మీ డాక్టర్ శేఖరంగారే మమ్మల్ని రప్పించారు. అందుకే మేంవచ్చాం. మా సామాన్లు మా గదిలోకి చేర్పిస్తే..." సరళ మాట పూర్తికాకముందే సుబ్బులు సూట్‌కేసుల్ని ఎత్తుకుంది.

మేడ మెట్లెక్కుతూ "భగవంతుడా! ఇక ఈ ఇంటిని రక్షించటం నీ తరంగూడా కాదు. ఉన్న మేళాలు చాలక ఆ మహాతల్లిగూడ సమయానికే ఊడిపడింది" అని వాపోయింది సుబ్బులు.

2

విశాలమైన హాలులాంటి పెద్ద గదిలో రోగి బెడ్‌మీద పడుకుని వున్నాడు. మగతలో వున్నాడేమో, కళ్ళుమూసుకుని వున్నాడు.

కోమలి బెడ్‌మీదకువంగి అతడి ముఖంలోకి చూస్తోంది. అతడి నుదుటిమీద చెయ్యివేసి చూసింది.

"అతడికి విశ్రాంతి అవసరం!" సరళతో బాటుగా ప్రవేశించిన సుబ్బులు వారించింది.

బెడ్‌మీదున్న వ్యక్తి ముఖం తెల్లగా పాలిపోయి వుంది. బహుశా చాలా వీక్‌గా వున్నాడనే చెప్పవచ్చు.

"చావు బ్రతుకుల్లో వున్నాడు!" స్వగతంలా పెద్దగానే పలికింది కోమలి.

"భగవంతుడా! ఆయన్నేం చేయకు!" పైకప్పుకేసి

నమస్కారంచేస్తూ మొత్తుకుంది సుబ్బులు.

"నేనుండగా ఆయనజోలికి యముడ్ని రానిస్తానా? అన్నట్టు పేషెంట్ ఛార్ట్ ఎక్కడ?" కోమలి బెడ్ చుట్టూ తిరిగి ఛార్ట్‌ని వెతికి తీసుకుంది.

సరళ అతడ్ని నిశితంగా చూసింది. పేషెంట్ నిద్ర పోతున్నాడు. కానీ అది సహజమైన నిద్రకాదు. మత్తు మందు ఇవ్వబడింది అతడికి.

"సుబ్బులూ! ఆయిన్నెవరు కాల్చారు?" కోమలి, సుబ్బులువంక తిరిగి అడిగింది.

"అదేమో నాకూ తెలియదమ్మా! ఆయన తోటలో తిరుగుతూండగా ఎవరో ఆయున్ని కాల్చారట! అంతకన్న నాకేం తెలీదు."

"అతడ్ని లోపలకు చేర్చిందెవరట?"

"వంటమనిషి రోశయ్య, వివేకానంద, మధుమూర్తి! రోశయ్య నీకు తెలిసుండాలి. మిగతా ఇద్దర్నీ నీవెరగవులే! వివేకానంద అనే ఆయన లక్ష్మణరావు క్లాస్‌మేట్ అట! మధుమూర్తి మాధురిదేవిగారి తమ్ముడు."

"సరే! పరామర్శలు తరువాత! ముందు మనం డ్రెస్ మార్చుకునివస్తే పోలా! సుబ్బులూ! కాస్త కాఫీ ఏమన్నా ఉందా?" సరళ నీరసంగా చూసింది.

సుబ్బులు మూతి విరుస్తూ క్రిందకు వెళ్ళిపోయింది.

"ఆయన్ని కనిపెట్టుకుని ఉండు. నేను డ్రెస్ మార్చుకుని వచ్చాక, నీవు వెళ్ళువుగాని!" కోమలి వెళ్ళిపోయింది సరళను అక్కడే వుంచి.

సరళ టేబుల్ దగ్గరకు వెళ్ళి అక్కడున్న మందుల్ని గమనిస్తోంది.

గదిలోకి మరో అందాల బొమ్మ ప్రవేశించింది. అయిదడుగుల ఎత్తు, పొట్టిగా వున్నా, వంపుసొంపులు మాత్రం గ్రీక్ శిల్పసుందరిని గుర్తుకు తెస్తోంది.

మిసమిసలాడే ఛాయ, గుండ్రటి కళ్ళు, చక్కగా అమరిన ముక్కు, అందమైన ముఖం, మంచి శరీర సౌష్టవం, ఒంటినిండా నగలు, సినిమా స్టార్‌ని తలదన్నేలాగుంది ఆమె.

"ఎవరమ్మాయ్ నువ్వు? ఓ! డాక్టర్ కబురుపెట్టిన నర్స్‌వా నువ్వు!" ఆమె అడిగింది సరళవంక చూస్తూ, పేషెంట్‌ని సమీపిస్తూ.

"అవునండీ! నా పేరు సరళాదేవి! పేషెంట్‌కి ఇంకా మగత వదల్లేదు. ఆయన్ని డిస్టర్బ్ చెయ్యకండి!"

ఆ యువతి గర్వంగా చూసింది, ఒక నౌకరు తనను శాసిస్తుందా అన్నట్టు.

అంతలో నర్స్ యూనిఫారంలో కోమలి ప్రవేశించింది.

ఆత్రుతగా వచ్చిన కోమలి గుమ్మంలోనే ఆగిపోయింది. బెడ్ దగ్గరున్న నూతన యువతివంకే చూస్తూ అవాక్కై నిలిచింది.

ఆ యువతి కోమలివంక నిర్విణ్ణురాలై చూసింది.ఆగర్భ శత్రువుల్లా ఒకరినొకరు చూసుకున్నారు ఒక్క క్షణం.

ఆ యువతి గొంతు సవరించుకుంది. "నువ్వా కోమలి! మళ్ళీ ఈ ఇంటి గుమ్మం తొక్కటానికి నీకెన్ని గుండెలు?"

"మాధురీ..." కోమలి ఏదో చెప్పబోయింది కానీ ఆ తర్వాత ఆమె కంఠం పూడిపోయింది.

"ఆఖరికి ఈ రూపంలో అవతరించావన్నమాట! ఎంతటి నెరజాణవు కాకపోతే ఇంత సాహసానికి ఒడిగడతావ్?"

"అదేం లేదండీ! ఇక్కడకు వచ్చేవరకూ మాకు పూర్తి వివరాలే తెలీవు. ఎక్కడకు పోతున్నదీగూడ తెలియజేయ లేదు. తీరా కారు ఈ బంగళా ముందు ఆగేవరకు మా గమ్యం ఎక్కడకో మాకే తెలీదండి!" సరళ సర్ది చెప్ప బోయింది.

"సరే! నీ స్థానం ఏమిటో తెలుసుకుని మసలుకో! వెనక టిలా వగలాడి వేషాలు కుదరవు. ఈ దఫా నేనున్నాను ఈ బంగళాకు సర్వాధికారిణిని!" మాధురి అహం ఒలక బోస్తూ వయ్యారంగా అంది.

"నీవు ఈ ఇంటికి సర్వాధికారిణివి ఎలా అయ్యావ్? లక్ష్మణరావు మళ్ళి పెళ్ళిచేసుకోలేదే?" కోమలి మొండిగా ప్రశ్నించింది.

"లక్ష్మణరావు మళ్ళి పెళ్ళిచేసుకోని మాట వాస్తవమే! కానీ నన్ను పరాత్పరరావుగారే పెళ్ళాడారు! నేను ఇప్పుడు లక్ష్మణరావుకి సవతి తల్లిని. కనుక నే లక్ష్మణ రావుని నీనుంచి రక్షించుకునే బాధ్యత నాపై వుంది."

"అంటే డబ్బుకోసం ముసలాయన్ని పెళ్ళాడావా?"

"అదంతా నా ఇష్టం! ఇదిగో నీకు ఆఖరుసారిగా చెబు తున్నాను. లక్ష్మణరావు నీ ముఖం చూడడు. పరాత్పర రావుగారు నిన్నిక్కడ ఒక్క క్షణం ఉండనివ్వడు. కనుక నిన్ను బలవంతంగా మా నౌకర్లు గెంటేయక ముందే నీవిక్కడనుంచి వెళ్ళిపోవటం నీకే మంచిది."

"ఆయన్ని రక్షించుకునే భారం నామీద వుంది. ఈ బాధ్యతనుంచి నన్ను ఎవరూ వేరుచెయ్యలేరు" కోమలి మొండిగానే జవాబిచ్చింది.

"ఆయన! ఇంకా నీకు 'ఆయన'లా అవుతాడు? కోర్టులో

మీదు విడాకులివ్వబడ్డాక! నీవు ఈ ఇంటిలో ప్రవేశించి తండ్రీ కొడుకులమధ్య ఎలాంటి అఘాతాన్ని సృష్టించావో అప్పుడే మరిచావా? లక్ష్మణరావు బంగారు భవితవ్యాన్ని చేతులారా పాడుచేశావు నీ స్వార్థంకోసం! నీ కపట ప్రేమతో డబ్బుకోసం, ఐశ్వర్యంకోసం ఆడిన నాటకాల్ని ఈ ఇల్లు మరువదు ఎన్నటికీ!''

కోమలి ముఖం లజ్జతో, అవమానంతో తెల్లబడింది. కళ్ళు మాత్రం కోపాన్ని వెలిగ్రక్కుతున్నాయ్.

వాళ్ళిద్దరూ కలబడి యుద్ధం చేస్తారేమో అనిపించింది సరళకు.

''కోమలి! మన లగేజీలోంచి మందుల్ని తీసుకువద్దాం రా!'' అంటూ కోమలిని తమ గదికి లాక్కుపోయింది సరళ.

''మధ్యాహ్నం మూడు గంటలకు మళ్ళీ రైలువుంది. నీ తిరుగు ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకో!'' వెనుక నుంచి మాధురి అరుస్తోంది.

ఇద్దరూ తమకు కేటాయించబడిన పెద్ద గదిలోకి వచ్చారు. తమ లగేజీని ఊడదీసి, అన్నిటినీ అలమారుల్లో సర్దారు.

3

''అయితే ఈ ఇంటికీ నీకూ లోగదే అనుబంధం వున్నదన్నమాట!'' అంది సరళ కోమలిని చూస్తూ.

''అవును! నేనూ, లక్ష్మణరావూ ప్రేమించుకున్నాం. రహస్యంగా పెళ్ళి చేసుకున్నాం. లక్ష్మణరావు తండ్రి పరాత్పరరావు కీ సంగతి నచ్చలేదు. మాధురిని తన కొడుక్కు చేసుకోవాలనుకున్నాడు. అందుకు విరుద్ధంగా

కొడుకు చేసిన పనికి అతగాడికి కోపం వచ్చింది.

“లక్ష్మణరావుకి అమెరికాలో ఏదో ట్రెయినింగ్ కి వెళ్ళే అవకాశం వచ్చింది. అతడు లేనప్పుడు నాపైన అభాండాలు వేస్తూ ఉత్తరాలు రాశారు. దాంతో లక్ష్మణ రావు ఇండియాకు తిరిగి వస్తూనే, నా ముఖమైనా చూడకుండా విడాకులిచ్చేశాడు.

“ఈ లోపలే, మాధురి పరాత్పరరావుని వలలో వేసుకుని, అతడ్నే పెళ్ళాడింది. లక్షల ఆస్తికి అధికారిణి అయింది. మగడు ముసిలాడయితేనేం డబ్బు వచ్చింది” కోమలి తన గత చరిత్రను వివరించింది.

“అంటే, మళ్ళీ నీ భర్తను నీవు చేరుకోవాలనే ఉద్దేశ్యంతో వచ్చావన్న మాట! కానీ, ఇది వరకు పరాత్పర రావు మాత్రమే నీకు అడ్డంకి! వాయువుకి అగ్నిలా, ఆయనకు ఇప్పుడు మాధురి గూడ తోడయింది. ఒకవేళ నీ భర్త నిన్ను నిరాకరిస్తేనో?”

“అది నా దురదృష్టం అనుకుని ఈ యింటినుంచి శాశ్వతంగా దూరంగా వెళ్ళిపోతాను. ఇంతకీ ఆయనకు నాపై ఎలాంటి అభిప్రాయం వుందో తెలుసుకోవాలి గదా!” కోమలి నిరాశగా అంది.

సరళ థర్మామీటరూ మరికొన్ని మందులూ తీసుకుని లక్ష్మణరావు గదిలోకి నడిచింది.

సరళ కుర్చీలాక్కుని లక్ష్మణరావు బెడ్ కి దగ్గరగా కూర్చుంది. పేషెంట్ ని కనిపెట్టుకుని వుండే బాధ్యతను స్వీకరించింది.

మరో పావుగంట గడిచింది. ఇద్దరు వ్యక్తులు ఆ గది లోకి ప్రవేశించారు.

అందులో ఒకరు డాక్టరు డ్రెస్‌లో వున్నారు. అతడే డాక్టర్ శేఖరం అయివుండాలి అనుకుంది సరళ. పొడుగ్గా, సన్నగా వున్నాడు. నుదుటిమీద మడతలూ, కళ్ళక్రింద గుంటలూ అతడు నడివయసు దాటిన వాడని చెప్పకనే చెబుతున్నాయ్.

రెండో వ్యక్తి పోలీసు అధికారి. సబ్ ఇన్స్పెక్టర్. కోరమీసాలూ, ఎర్రగా యూనిఫారంలో హుందాగా వున్నాడు.

సరళ లేచి నిల్చుంది. డాక్టర్ శేఖరం ఆమెవంక చూసి, పేషెంట్ మీదకు దృష్టి మరల్చుకున్నాడు.

"నేను చెప్పాను కదూ? అతడిపై ఎవరూ హత్యా ప్రయత్నం చెయ్యలేదు. పొరపాటున తుపాకి ప్రేలింది. అతడు గాయపడ్డాడు. అంతే!" చిన్న స్వరంలో ఇన్స్పెక్టర్‌కి నచ్చచెప్పేయత్నంలో వున్నాడు డాక్టర్.

కానీ పోలీసులకు అనుమానాలెక్కువ. డాక్టర్ మాటల్ని సబ్ ఇన్స్పెక్టర్ నమ్మినట్టుగా కనిపించలేదు.

"ఏదీ ఆ తుపాకీని, బుల్లెట్‌ని చూపించండి!" అన్నాడు అధికారస్వరంలో.

"అది అసాధ్యం!" జేబులోంచి హ్యాండ్ కర్చీఫ్ తీసి నుదుటి మీద చెమటను తుడుచుకుంటూ అన్నాడు డాక్టర్ శేఖరం. "ఆపరేషన్ చేసి బుల్లెట్ తీశాను. కాని, అది ఎక్కడో పోయింది. తుపాకి గూడా మాయమయింది. ఇది ఎలా జరిగిందో మాకే అంతు పట్టటంలేదు."

"అలాగేం?" అన్నాడు ఇన్స్పెక్టర్ పొడిగా. "ఈ ప్రమాదం నిన్న రాత్రి జరిగిందా?"

"అవునండీ! ఆ సమయంలో ఈ ఇంట్లో వంటవాడు

కాశయ్య వంటగది సర్దుతున్నాడు. నౌకరు కన్నయ్య వివేకానంద, మధుమూర్తి వాళ్లూ వున్నారు. తుపాకీ ప్రేలుడు విని బయటకు పరుగెత్తారు. అక్కడ తోటలో లక్ష్మణరావు గాయంతో పడివున్నాడు. అందరూ సాయం పట్టి అతడ్ని లోపలకు చేర్చి నాకు కబురు చేశారు. నేను వచ్చిన వెంటనే ఆపరేషన్ చేసి బుల్లెట్‌ను తీశాను. వెను వెంటనే మీకు రిపోర్టిచ్చాను.''

''సరే! ఇంట్లో అందర్నీ నేను ప్రశ్నించి తెలుసు కుంటాను. ఒకరిపై ఒకరికి ద్వేషాలు ఏదైనా ఉన్నాయా, ఈ ఇంటిలోని సభ్యుల్లో?'' ఇన్స్పెక్టర్ టోపీ తీసి చేత్తో తల నిమురుకుంటూ అడిగాడు.

''మీరెవర్నీ ప్రశ్నించే అవసరం వుండదు. ఎందుకంటే అందరూ నమ్మకమైన వారే!'' డాక్టర్ శేఖరం తొందర పడ్డాడు.

''ఆ విషయం మాకు నమ్మకం కుదరాలి గదా!'' అంటూ ఇన్స్పెక్టర్ బయటకు నడిచాడు.

4

''నర్స్!'' ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టుగా హీన స్వరంలో పిలుపు వినవచ్చింది.

నర్స్ సరళ బెడ్ దగ్గరకు వెళ్ళింది. బెడ్ మీద పేషెంట్ లక్ష్మణరావు కళ్ళు తెరిచాడు. అతడు చాలా నీరసంగా వున్నాడు. అతికష్టం మీద, బలాన్నంతా కూడగట్టుకుని మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాడు.

''నర్స్! కోమల అంటున్నారేమిటి?''

''మీరు మాట్లాడకూడదు. కోమల అనే మరో నర్స్ నాతోగూడా వచ్చింది.''

"ఆమెను పిలవండి! నాకు స్పృహ తప్పేలోపల ఒక్కసారి ఆమెను కళ్ళారా చూడనివ్వండి!" బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు.

అంతలోనే కోమలి డ్రెస్ వేసుకుని ఆ గదిలోకి వచ్చింది. ఎన్నో యుగాల వియోగానంతరం కలుసుకున్న ప్రేమికుల్లా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు లక్ష్మణరావు.

"వచ్చావా కోమలీ! జన్మలో మళ్ళీ నిన్ను చూస్తాననుకోలేదు. మా నాన్న, మాధురి ఆడిన నాటకంలో నిన్ను నేను కోల్పోయాను."

కోమలి పెదవులు వణికినయ్. "అంటే...అంటే మీకింకా నాపైన దయ వున్నదన్నమాట!"

లక్ష్మణరావు మళ్ళీ తెలివి తప్పిపోయాడు. కళ్ళు మూతలు పడగా, తల ప్రక్కకు వాల్చివేశాడు.

కోమలి ఆతృతగా "ఏమండీ!" అంటూ అతడ్ని కదిలించింది.

సరళ కలుగజేసుకుంది. "కోమలి! మీ భార్యాభర్తల అనురాగంలో నీ డ్యూటీని మర్చిపోతున్నావ్.

అతడు ప్రస్తుతం మృత్యుదేవత ఒడిలో చెలగాటమాడబడుతున్నాడు. అతడ్ని ముందు దక్కించుకోవాలి."

ఇంజెక్షన్ సిరెంజిలోకి మందు ఎక్కించి, లక్ష్మణరావుకు ఇంజెక్షన్ ఇచ్చింది సరళ.

కోమలి అతడి దగ్గరే కూర్చుంది, అతడి ముఖంలోకే చూస్తూ.

నౌకరు కన్నయ్య గది వాకిట్లో ప్రత్యక్షమయ్యాడు. "పెద్దయ్యగారు నిన్ను రమ్మంటున్నారు" అన్నాడు సరళ వంక చూస్తూ.

సరళ, కోమలి యిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసు కున్నారు. "ఆయన దగ్గర నేను వుంటాన్లే! నువ్వు వెళ్ళిరా!" అంది కోమలి.

సరళ, నౌకరు కన్నయ్య వెనుకే నడిచింది.

మరో పెద్దగదిలో నాలుగు ప్రక్కలా సోఫాలూ, మధ్యలో టీపాయ్ వున్నాయ్, ఒకవైపు సోఫాలో పరాత్పరరావు కూర్చుని వున్నాడు. వాడిచూపులూ, తెల్లని గుబురు మీసాలూ, సిల్కు లాల్చీ, మెడలో బంగారు గొలుసుకు వ్రేలాడుతున్న పులిగోరు మనిషి హుందాగానూ, భీకరంగానూ వున్నాడు.

"నా కొడుకు జీవితాన్ని పాడు చేసిన యువతి మళ్ళీ నర్సురూపంలో ప్రవేశించిందని మాధురి చెప్పింది. ఆమె ఈ ఇంట్లో మరొక్క క్షణం గూడా వుండటానికి వీల్లేదు. ఆమె స్థానే మరో నర్సు వచ్చేదాకా, నీవే పేషెంట్‌ని కనిబెట్టివుండాలి. నీవు భోజనానికి దానికీ వెళ్ళినప్పుడు మరెవరన్నా చూస్తారులే!"

తన మాటే వేదం అన్నట్టుగా అతడు చెప్పుకు పోతున్నాడు.

"క్షమించాలి! ఆమె గూడా నాతోబాటు వుంటుంది" అంది సరళ నిదానంగా.

పరాత్పరరావు ఈ హఠాత్పరిణామానికి కొంతఆశ్చర్య పోయాడు.

"ఏమంటున్నావ్?" మేఘ గర్జనలా వచ్చింది ప్రశ్న.

"కోమలిని పంపేందుకు వీలులేదు. ఆమె నాతోటే వుంటుంది. ఇక పేషెంట్‌ని ఇరవయ్ నాల్గంటలూ కని బెట్టుకుని వుండాలంటే, ఇద్దరు నర్సులు తప్పనిసరి!"

"నీకు కావలసింది మరో నర్స్! అంతే! రేపీపాటికి ఇంకో నర్స్‌ని రప్పిస్తాం!"

"చూడండి! మీ కొడుకు బ్రతకాలని గనుక వుంటే కోమలి ఇక్కడ వుండడం అవసరం!" సరళ మాటలు అతడి మనసుకు నాటుకున్నాయ్.

"డాక్టరు ప్రాణాపాయం లేదన్నాడే?"

"ప్రాణం పోయేవరకూ డాక్టర్లు అలాగే చెబుతుంటారు. ఇంకా ఇరవయ్ నాలుగు గంటలు గడిస్తే కానీ ఏ సంగతీ నిర్ధారించి చెప్పలేం. అదీగాక అతడికి తెలివి వచ్చిన కొద్ది క్షణాల్లో కోమలిని చూసి గుర్తించటం జరిగింది."

పరాత్పరరావు ముఖంలో రంగులు మారాయ్.

అతడు కన్నయ్యను కేక వేశాడు. కన్నయ్య వచ్చాడు. "వెళ్ళి కోమలిని పిలుచుకురా!" అన్నాడు.

సరళ అక్కన్నుంచి కదలబోయింది.

"నువ్వు ఇక్కడే వుండు!" అన్నాడు పరాత్పరరావు.

కొద్ది క్షణాల్లోనే కోమలి వచ్చింది.

ఆమెవంక తినేసేలా చూశాడు. "మళ్ళీ ఏముఖం పెట్టుకు వచ్చావ్?"

"కేవలం నర్సుగా, ఒక పేషెంట్‌కి సేవ చేసేందుకే వచ్చాను."

"కాదు. ఈ నెపంతో మళ్ళీ వాడ్ని వలలో వేసుకోవాలని వచ్చావ్. కానీ, నీ ఆటలు సాగనివ్వం. నీవు ఎంత త్వరగా ఈ యింటినుంచి వెళ్ళిపోతే అంత మంచిది."

"నేను కేవలం నర్స్‌గా వచ్చాను. మీ కుమారుడంటే మీకు ఎంత మమకారమో నాకూ భర్త అంటే అంతటి

అనురాగం ఉంటుందనే విషయాన్ని మరిచారు. అదే మరొక స్త్రీ అయితే, మీరు నాకు చేసిన ద్రోహానికి మిమ్మల్ని నిలువునా హత్య చేసివుండేది" కోమలి కంఠం జీరబోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయ్. పెదాలు వణుకుతున్నాయ్. ఆవేశంతో రొమ్ములు ఎగసి పడుతున్నాయ్.

చివాలున వెనుదిరిగి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

పరాత్పరరావు అవాక్కై ఆమె వైపే చూస్తుండిపోయాడు.

ఒక్క క్షణం తర్వాత సరళ గూడా అక్కడ్నుంచి కదిలింది. మేడమెట్లెక్కుతూండగా మరో వ్యక్తి తారసిల్లాడు.

ఆ వ్యక్తి ఎర్రగా వున్నాడు. పిల్లికళ్ళు, అందమైన ముఖం ఎటువంటి వారినైనా ఆకర్షించేలా వున్నాడు.

"చూడు నర్స్! లక్ష్మణరావుకు ప్రాణాపాయం లేదు గదా!" అని అడిగాడు. అతని మాటలు వీణ మీటినట్టు శ్రావ్యంగావున్నయ్.

సరళ ఒక్క క్షణం తనను తాను సంబాళించుకుంది.

"ప్రాణాపాయం లేదనే అనుకుంటున్నాను."

"అతడికి తెలివి వచ్చినప్పుడు ఎవరు కాల్చిందీ చెప్పాడా! బహుశా అతడికి తప్పక తెలిసేవుండాలి."

"లేదు. ఏమీ చెప్పలేదు."

5

సరళ పేషెంట్ రూంలోకి వచ్చింది. కోమలి బెడ్‌కి ప్రక్కనే కుర్చీలో కూర్చుంది. అరచేతుల్లో ముఖం పెట్టుకుని తన భర్తవంకే, చట్టం ప్రకారం మాజీ భర్తవంకే చూస్తున్నది.

"రాత్రి పదీ, పదకొండు గంటలకు నన్ను లేవు. నీవు నిద్రపోదువుగాని నేను కనిపెట్టుకుని వున్నప్పుడు. ఈ లోపల నేను భోజనం చేసి నిద్రపోయిలేస్తాను." కోమలికి చెప్పి సరళ తన రూమ్‌కి బయలుదేరింది.

భోజనం పూర్తికానిచ్చి బెడ్ మీద వాలింది సరళ. కోమలి స్థితిని తల్చుకుంటూంటే, జాలీ, సానుభూతీ కలుగు తోంది. ఆమె జీవితంతో చెలగాటమాడుకున్న ఈ ఇంటి లోని వ్యక్తుల్ని చూస్తుంటే సరళకు కోపం వస్తున్నది. నిద్ర రావటంలేదు. కిటికీలోంచి చూస్తుంటే నక్షత్రాల వెలు గులో తోట కనుపిస్తోంది.

అంతలో ఎవరో మనిషి తోటలోకి రావటం గమనిం చింది.

సరళ ఆ వ్యక్తి ఎవరో కళ్ళు మూసుకునైనా చెప్ప గలదు. ఆ వ్యక్తి కోమలి. ఆమె చెట్లపొదల్లో దేనికోసమో వెతుకుతున్నది.

సరళ ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసుకుని చీకట్లోకి చూసింది. కొద్దిసేపట్లో ఆ ఆకారం వెళ్ళిపోయింది.

సరళకు కోమలిపైగూడ అనుమానం కలిగింది. ఈ ఇంట్లోకి తిరిగి ప్రవేశించిన కోమలి మనసులో ఏదో దురభి ప్రాయం వుందనుకుంది.

బెడ్ మీదకు వాలింది ఆలోచనల్లో. కంటిమీద కునుకు పడుతూండంగా, ఎవరో స్త్రీ పెద్దగా అరవటం విన్పిం చింది.

బెడ్ మీదనుంచి ఒక్క ఎగురుతో లేచింది సరళ. ఆ కంఠం కోమలిదే అనుకుంది.

తలుపుతీసి ఆ ఆక్రందన వచ్చినవేపు పరుగెత్తింది.

పరాత్పరరావు గది తలుపు తీసి వుంది. లోపల పెద్ద లైటు వెలుగుతోంది.

సరళ గడపలో అడుగుపెట్టింది. నేలమీద పరాత్పర రావు పడిపోయి వున్నాడు. అతడి రెండు చేతులు అతడి ఛాతికి అదిమిపట్టినయ్. గుండెపోటు భరించలేక తన్నుకు లాడినవాడిలా కనుపించాడు.

అతడి ప్రక్కనే కోమలి నిలబడి ఉంది. ఆమె చేతిలో ఇంజెక్షన్ సిరెంజి ఉంది.

"సరళా! నేనాయన్ని చేతులారా చంపాను!" బావురు మంది కోమలి, సరళను చూస్తూనే.

అంతలో మిగతా గదుల్లో వ్యక్తులు మేల్కొన్నట్టుగా అలజడి వినిపించింది. మనుష్యులు పరిగెత్తుకు వస్తున్నట్టు అడుగుల సవ్వడి వినవస్తోంది.

బహుశా కోమలి చేసిన ఆక్రందనకు వారంతా మేల్కొని వుండాలి.

"అతడ్ని చంపాలని కాదు. అతడికి సాయంచెయ్య బోయాను. కానీ అతడు తక్షణమే మరణించాడు..." ఆమె ఇంకా ఏదో చెప్పబోతోంది.

ఆ సమయంలో ప్రతి సెకనూ అతి విలువైనదని గ్రహిం చింది సరళ. ఆలోచనలకు, వాదాలకూ తావులేదు. కోమలి చేతిలోని సిరెంజిని లాక్కొని, తన జేబులో దాచేసింది.

మనుష్యులు చేరువలోకి వచ్చినట్టు పాదాల అలికిడి దగ్గిరౌతున్నది.

"ఏం భయం లేదు. వెంటనే డాక్టర్ని పిలిపిద్దాం!" అందరికీ వినిపించేలా అంది సరళ, కోమలి మాటల్ని కవర్ చేస్తూ.

6

ముందుగా గదిలోకి వచ్చిన వ్యక్తి వివేకానంద. అతడి వెనుకే కన్నయ్య, మాధురీ వచ్చారు.

"ఏం జరిగింది?" వివేకానంద ఆత్రుతగా అడిగాడు' పరాత్పరరావు చెయ్యి పట్టుకుని చూశాడు. "ప్రాణం పోయిందనుకుంటాను!. హార్ట్ఎటాక్ వచ్చి వుంటుందా?" అన్నాడు మళ్ళీ.

"హార్ట్ ఎటాక్కే అయి వుంటుంది." సరళ బదులు చెప్పింది. "త్వరగా డాక్టర్ గార్ని పిలిపించండి!"

"ఈ ఇంటికి శనిలా దాపురించావు కదే! హరి దేవుడా? నా మొగుడ్నెత్తుకు పోయావు గదరా!" మాధురి శోకాలు పెట్టసాగింది.

"కోమలీ! నీవు వెళ్ళి డాక్టర్ గార్ని పిల్చుకురా త్వరగా!" కోమలిని అక్కడ్నుంచి పంపేయటం మంచిదనుకుంది సరళ.

కోమలి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

మరికొద్ది నిముషాల గడిచేక సరళ గూడ అక్కడ్నుంచి వచ్చేసింది. "ఏదీ డాక్టరుగారు ఇంకా రాలేదేం? నేనన్నా వెళ్ళి పిలిచి వస్తాను" అంటూ.

కారిడర్లోంచి పోతూ, లక్ష్మణరావు రూమ్లోకి చూసింది. అతడి గది తలుపు బార్లా తెరచి వుంది. బెడ్ మీద లక్ష్మణరావు లేడు. బెడ్ ఖాళీగా వుంది.

పేషెంట్ ఏమయాడా అని కారిడార్లోనే నిల్చుని అటూ యిటూ చూసింది. కారిడార్ చివర మెట్లున్నయ్. అక్కడ చీకట్లో ఎవరో ఉన్నట్టుగా తోచింది. ఆత్రుతగా అక్కడకు పరుగెత్తింది సరళ. లైటు స్విచ్ నొక్కాలన్న

ఆలోచనగూడ రాలేదు ఆమెకు అదుర్దాలో.

మెట్లదగ్గర లక్ష్మణరావు పడిపోయి వున్నాడు. అతడ్ని లేవదీయటానికి యత్నిస్తోంది కోమలి.

"కోమలీ! ఏమయింది?"

"అదే నాకూ తెలీదు. డాక్టరుకోసం వస్తూంటే, ఈ గదిలో బెడ్ ఖాళీగా వుంది. ఆయనకోసం వెతుక్కుంటూ వచ్చాను. ఇక్కడ నేలమీద పడి వున్నాడు ఆయన."

సరళ కారిడర్‌లో స్విచ్ నొక్కింది. లైటు వెలిగింది. పడిపోయిన లక్ష్మణరావు తలపై పెద్ద బొప్పి వుంది. ఎవరో అతడ్ని తలపై బాది వుండాలి వెనుకనుంచి. అతడు ఆ దెబ్బకు స్పృహతప్పి పడిపోయాడు.

సరళ, కోమలి కలిసి అతడ్ని పైకెత్తారు. నెమ్మదిగా తీసుకువచ్చి బెడ్‌మీద పడుకోబెట్టారు.

కోమలి అతడి తలపై బొప్పికి మందురాచింది. సరళ లక్ష్మణరావుకి స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపింది.

లక్ష్మణరావుకి తెలివి వచ్చింది. "మా నాన్న గదిలో అరుపు విని నాకు అదుర్దా వేసింది. ఎలాగో లేచి నడుస్తున్నాను. వెనుకనుంచి ఎవరో తలపై కొట్టారు. నేను పడి పోయాను."

కారిడర్‌లో అడుగుల చప్పుడు వినవచ్చింది. సరళా, కోమలీ అటుగా చూశారు.

డాక్టర్ శేఖరం పెద్ద పెద్ద అంగలతో వెళ్తున్నాడు. సరళ గూడా అతడి వెనుకనే వెళ్ళింది.

పరాత్పరరావు నాడిసీ, గుండెనూ పరీక్షించాడు డాక్టర్.

"ప్చ్! ప్రాణం పోయింది. హార్ట్ ఎటాక్ గనుక వ సే

వేసుకునేందుకు బిళ్ళలూ, మరో ఇంజెక్షన్ సిరెంజీ రెడీగా అతడి డ్రాయర్లోనే, అందుబాటులో వుంటాయే!'' డాక్టర్ అనుమానంగా చూశాడు.

''అవును! కానీ మందు వేసుకునే వ్యవధిగూడ లేదేమో పాపం!'' వివేకానంద సానుభూతి చూపాడు.

డాక్టర్ వంగి చూశాడు పరాత్పరరావు చేతిని. ముంచేతి దగ్గర ఇంజెక్షన్ చేసినట్టుగా, ఇప్పుడిప్పుడే చెరిగిపోతున్న సన్నని గుర్తు కనుపించింది.

అతడికి అనుమానం వచ్చినవాడిలా డ్రాయరు తెరిచి చూశాడు. డ్రాయర్లో టాబ్లెట్స్ లేవు. ఇంజెక్షన్ బాటిల్, సిరెంజిగూడ మాయమయినై.

''ఇది ఎవరో కావాలని చేసిన పనే! అతడికి అందుబాటులో ఉన్న మందుల్ని మాయంచేశారు. ఆ తర్వాత ఆయనకు ఉద్రేకం తెప్పించి వుంటారు! అంటే చేతులారా ఆయన్ని హత్యచేసినదానిక్రిందే లెక్క!'' డాక్టర్ శేఖరం పిచ్చిగా అరిచాడు.

''మనందరం వీలైనంత త్వరగానే వచ్చాం. ఇంతలోనే మన కళ్ళుగప్పి హంతకుడెలా మాయమవుతాడు?'' వివేకానంద ప్రశ్నించాడు.

అతడి ప్రశ్నకు అందరూ తలూపారు.

అంతలో అక్కడికి పోలీస్ ఇన్స్పెక్టర్, మరో నలుగురు కానిస్టేబుల్స్ వచ్చారు.

''ఈ ఇంట్లో హత్య జరిగిందని ఎవరో మాకు ఫోన్ చేశారు కొద్దిక్షణాల క్రితం!'' అన్నాడు ఇన్స్పెక్టర్ అక్కడున్న అందర్నీ ఉద్దేశించి.

అందరూ ఒక్కక్షణం నివ్వెరపోయారు. పరాత్పర

రావు మరణవార్త ఇంకా ఈ ఇంట్లోనే అందరికీ తెలియదు. అటువంటిది అప్పుడే ఈ విషయం పోలీసులదాకా ఎలా వెళ్ళింది? ఎవరు ఫోన్ చేసి వుంటారు ఇంతలోనే?

“ఏదో పొరబాటు జరిగింది. మీరన్నా చెప్పండి!” మాధురి తొట్రుపాటుతో అంది డాక్టర్ వంక చూస్తూ.

“అవునవునండీ! ఈయనకు నేను ఫామిలీ డాక్టర్ని. ఈయనకు తరచూ గుండెపోటు రావడంకద్దు. బహుశా ఈదఫా ఎక్కువ మోతాదులో సీరియస్ గుండెపోటు రావడంతో అతడు మరణించాడు. అంతేకానీ ఇది హత్య మాత్రం కాదు సార్!” డాక్టర్ శేఖరం అన్నాడు.

“అవచ్చు! కానీ మాకు అలా ఎందుకు ఫోన్ చేశారు?”

“డాక్టర్ గారు చెప్పేది నిజమేనండీ! మావారు హత్య చేయబడలేదు. గుండెపోటువల్లనే మరణించారు. బహుశా మీకు వచ్చిన ఫోన్ కాల్ మరెవరింట్లో గురించేమో” అంది మాధురి.

“అట్లా పొరబాటు జరిగేందుకు వీలులేదు. ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుంది నేను! ఎవరో స్త్రీ కంఠం! ఇదే ఇంటి నంబరు ఇచ్చింది.”

ఆపైన ఎవరూ మాట్లాడేందుకు సాహసించలేదు.

“ప్రమాదం జరిగాక ముందుగా చూసిందెవరు?” అందరివంకా చూస్తూ అడిగాడు ఇన్స్పెక్టర్.

“నేనండీ!” సరళ ముందుకు వచ్చింది. “జబ్బుగావున్న లక్ష్మణరావుకి పరిచర్యలు చేసేందుకు నేనూ, మరో నర్స్ కోమలీ నిన్ననే వచ్చాం!”

“లోగడ లక్ష్మణరావుని ప్రేమించి పెళ్ళాడి, మళ్ళీ విడాకులిచ్చిన కోమలే గదూ?”

సరళ మనస్సు చివుక్కుమంది. ఈ కోమలి సమాచారం క్షుణ్ణంగా తెలుసుకునే వచ్చాడన్నమాట ఇన్స్పెక్టర్. సాక్ష్యాలనుబట్టి చూస్తే కోమలిపై ఈ హత్యానేరం పడేలాగుంది. ఆమెను సరళ రక్షిద్దామని ఎంత తాపత్రయ పడుతున్నదో, సాక్ష్యాలు అంతగా కోమలికి వ్యతిరేకంగా ఉన్నయ్.

"ఆ గొడవకూ, ఈ మరణానికీ ఏం సంబంధంలేదండీ!" డాక్టర్ శేఖరం గుర్రుగా అన్నాడు ఇన్స్పెక్టర్ వంక చూస్తూ.

"పరాత్పరరావు చనిపోంగానే ముందు చూసిం దెవరు?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"నేనేనండీ! నేనతడ్ని సమీపించేసరికే అతడి ప్రాణం పోయింది. కోమలి నాకన్న ఒక్క అడుగు ముందువచ్చింది నా తర్వాత వివేకానంద వచ్చారు."

"కొద్ది రోజుల క్రితం కొడుకుని కాల్చారెవరో! ఈ రోజున తండ్రి మరణించాడు. ఈ రెండు సంఘటనలకూ సంబంధం వుండి తీరాలి. అంతకు ముందు తండ్రీ కొడుకులు ఘర్షణపడ్డారు గదా?" ఇన్స్పెక్టర్ డాక్టర్ని ప్రశ్నించాడు.

"తండ్రీకొడుకుల మధ్య విభేదాలు అనేకం వుండవచ్చు. కానీ ఆ విభేదాలు ఒకరినొకరు చంపుకునేటంత టివి కాదు!"

"కొడుకు తండ్రిపై కసి తీర్చుకోటానికి నిర్ణయించుకున్నాడు. తనను తానే కాల్చుకుని మంచమెక్కాడు. స్వస్థత లేనివాడిలా నటిస్తూ, అదను చూసి తండ్రిప్రాణం తీశాడు..."

“ఇన్స్పెక్టర్ ఇది మరీ దారుణం! మీ ఆరోపణ సమంజసమైంది కాదు!” అన్నాడు డాక్టర్ శేఖరం.

“లక్ష్మణరావు ఈ హత్య చేయలేదనటానికి ఎలిబీ వుంది. అతడ్ని అనుక్షణం అంటిపెట్టుకుని నేనో, కోమలో కాచుకునివున్నాం,” అంది సరళ.

ఇన్స్పెక్టర్ ఆమెవంక కొరకొర చూశాడు.

“సరే! మా విచారణ ముగిసేవరకూ, ఎవరూ ఈ ఇంటి ఆవరణదాటి పోరాదు. మృతదేహాన్ని శవపరీక్షకు పంపండి డాక్టర్ శేఖర్! మీరుగూడ పరీక్ష చేసేటప్పుడు దగ్గరుండండి.”

ఆ బంగళాకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయబడింది.

7

సరళ, లక్ష్మణరావు బెడ్ దగ్గరకు వచ్చింది.

లక్ష్మణరావు అడుగుల చప్పుడు విని కళ్ళు తెరిచాడు.

“నర్స్! ఏం జరిగింది?” అనడిగాడు.

“మీరు ఏ వార్తనూ సహించలేరు. మాట్లాడకుండా పడుకోండి!”

“నాకు తెలుసు నర్స్! ఏదో అనర్థం సంభవించిందని! నా తండ్రేనా చనిపోయింది?”

సరళకు ఇక తప్పనిసరి అయింది. పరాత్పరరావు మరణ వార్తను చెప్పింది. ఆ మరణాన్ని ఎవరో హత్యగా పోలీసులకు ఫోన్ చేశారని, విచారణ జరుగుతోందని తెలిసింది.

లక్ష్మణరావు కళ్ళు మూసుకున్నాడు గట్టిగా. అతడి మనసు బాధపడుతోందని గ్రహించింది సరళ. అతడికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చింది విశ్రాంతి కోసం.

కోమలి రాగానే సరళ డ్యూటీ దిగింది. మరో గదిలోకి వెళ్తూ ఆగింది. ఆతృతగా వెనక్కి పరిగెత్తు వచ్చింది.

"ఏమయింది?" కోమలి అడిగింది.

"నీనుంచి లాక్కున్న సిరంజిని నా జేబులో పెట్టుకున్నా నా? అంతలో పోలీసులు వచ్చారని తెలిసి, ఈ గది ప్రక్కనే కిటికీలోవున్న పాత గోతాల బొత్తిలో సిరంజిని దాచాను. అది మన దగ్గరవుంటే పోలీసులు వెదికి తీసుకుంటారేమో అని అలా చేశాను. పోలీసులు వెళ్ళాక దాన్ని తిరిగి తీసుకోవచ్చు గదా అనుకున్నాను. తీరా ఇప్పుడక్కడ చూస్తే సిరంజి మాయమయింది" సరళ తన ఆతృతను వెళ్ళబెట్టింది.

అది గనుక శత్రువు చేతిలో బడితే, దానిమీద కోమలి వేలిముద్రలు స్పష్టంగా వుంటాయి గనుక, దాన్ని పోలీసులకు ఇవ్వకుండా ఊరుకోడు. ఆ తర్వాత కోమలి ఉరికంబమెక్కటమో, లేక యావజ్జీవ కారాగార శిక్ష పొందటమో జరిగి తీరుతుంది.

"అసలు నీవు లక్ష్మణరావుని కనిబెట్టుకుని కూర్చోవలసిన దానివి పరాత్పరరావు గదిలోకి ఎందుకు వెళ్ళినట్టు?" నిలదీసి అడిగింది.

ఆ ప్రశ్నకు కోమలి తొట్రుపడ్డది. "మరేం లేదు నా భర్తకు నయమయేదాక నన్ను వుంచమని ప్రాధేయపడటానికి వెళ్ళాను. మాట్లాడుతూండగానే ఆయనకు గుండె పోటు వచ్చింది. డ్రాయర్లో సిరెంజీ, ఇంజెక్షన్ బాటిల్ తెచ్చి ఇంజెక్షనివ్వమని బ్రతిమిలాడాడు పరాత్పరరావు తమ మధ్య ఎన్ని విభేదాలున్నా కసి తీర్చుకోను అది సమయం కాదన్నాడు. దాంతో నాకు జాలేసింది.

డ్రాయరు తెరిచి ఇంజెక్షన్ యిచ్చాను ఆయనకు. మందు అతడి శరీరంలోకి ఎక్కుతూండగానే అతని ప్రాణం పోయింది,'' కోమలి నేలచూపులు చూస్తూ చెప్పింది.

ఆమె పూర్తిగా నిజం చెప్పటంలేదనిపించింది సరళకు.

8

మర్నాడుదయానికి మళ్ళీ ఇన్స్పెక్టర్ వచ్చాడు. పాలిపోయిన ముఖంతో డాక్టర్ శేఖరంగూడ అతడి వెంటనే వచ్చాడు.

''పరాత్పరరావుగారికి ఎవరో పాయిజన్ ఇంజెక్షన్ యిచ్చారు. బహుశా హంతకుడుకి బాగా తెలిసివుండాలి. ఆయనకు గుండెపోటు వచ్చినప్పుడు ఇంజెక్షన్ తీసుకుంటూ వుంటాడని! ఆ ఇంజెక్షన్ మందుసీసాలో విషాన్ని ఎక్కించి సీసాని మామూలు స్థానంలో వుంచాడు.

''పరాత్పరరావుకి గుండెపోటు రాగానే, అలవాటు ప్రకారం ఇంజెక్షన్ పుచ్చుకున్నాడు. లేదా ఎవరైనా ఆయనకు ఇంజెక్షన్ యిచ్చివుంటారు. కనుక ఈ కారణాల వల్ల పరాత్పరరావు ప్రమాదవశాత్తు మరణించలేదనీ, ఎవరో అతన్ని హత్య చేశారనీ రూఢి అవుతోంది.

''అయితే ఈ ఇంజెక్షన్ని ఎవరు చేశారూ అనేది మొదటి ప్రశ్న! కోమలీ, సరళా! మీ ఇద్దరిలో ఎవరైనా చేశారా?''

''లేదండీ!'' ఇద్దరూ ఏక కంఠంతో చెప్పారు.

''మిస్టర్ వివేకానంద్! నర్సుల వెనకాల నీవు వచ్చావ్ కదూ? నీవు ప్రవేశించినపుడు వాళ్ళచేతిలో ఇంజెక్షన్ సిరెంజ్ వుందా?'' అక్కడే వున్న వివేకానందని ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

సరళ, కోమలి ఊపిరి బిగబట్టారు, వివేకానంద్ ఏం చెబుతాడో అని!

"లేదండీ! వారి చేతుల్లో ఇంజెక్షన్ సిరెంజ్ లేదు" బల్లగుద్దినట్టుగా చెప్పాడు వివేకానంద్.

"అయ్యో! ఇన్స్పెక్టర్ గారూ! మమ్మల్నందర్నీ మీ ప్రశ్నలతో విసిగించకండి. ఈ యింటి పరువుప్రతిష్టలు కాపాడండి! పరాత్పరరావుని హత్య చేసేందుకు మోటివ్ ఒక్క కోమలికే వుంది. నలుగురికే వినబడేలా ఆయన్ను హత్య చేస్తానంది నిన్న," భద్రకాళిలా అరిచింది మాధురి.

అక్కడున్నవారంతా నిశ్చేష్టులయ్యారు.

"ఏమంటావ్ కోమలి! పైగా నీ గది సోదాలో నీ బ్యాగ్‌లో రివాల్వర్ దొరికింది. రాత్రిపూట రివాల్వర్‌తో పరాత్పరరావు గదిలోకి వెళ్ళావ్. అతడ్ని బెదిరించి నీ వెనుకటి స్థానాన్ని సంపాదించుకోవాలని యత్నించావ్. ఆ రకంగా పరాత్పరరావులో ఉద్రేకాన్ని కలిగించావ్.

ఉద్రేకంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. అంతకు ముందే సిద్ధం చేసుకునివున్న పాయిజన్‌ని ఆయనకు సేవ చేసే దానిలా నటిస్తూ, ఇంజెక్షన్ యిచ్చావ్. ఆ మందు సీసా ఇంజెక్షన్ సిరెంజీగూడా దొరికితే, నిన్ను కటకటాల్లోకి తోయిస్తాను."

మౌనంగా వింటున్న నౌకరు కన్నయ్య కలుగజేసుకున్నాడు.

"అవునండీ! అయ్యగారి గదిలోకి ఈమె వెళ్ళటం నేను చూశాను. ఇద్దరూ పెద్దగా ఘర్షణపడ్డారు. పెద్దోళ్ళ తగవుల్లో నాకెందునాలే అని నేను మెట్లుదిగి వచ్చేశాను. ఇంత ఘోరం జరుగుతుందని వూహిస్తే, ఆమెను అప్పుడే

తన్ని తగిలేసేవాడ్ని. పెద్దయ్యగారన్నా దక్కేవారు!" కన్నయ్య చెప్పటం ముగించి చిర్రున చీదేశాడు, సన్నగా ఏడుస్తూ.

"మిస్ కోమలీ! పరాత్పరరావుగారి రివాల్వర్ నీ గది లోకి ఎలా వచ్చింది? దీనికి నీ సంజాయిషీ ఏమిటి?" ఇన్స్పెక్టర్ కోమలివంక చూస్తూ అడిగాడు.

మాధురి కళ్ళు విజయగర్వంతో మెరుస్తున్నాయ్.

"లక్ష్మణరావుని ఎవరో కాల్చారు. ఆ రివాల్వర్ దొరక లేదని డాక్టరుగారు చెప్పారు. బహుశా అగంతకుడు ఆయన్ని కాల్చి, కంగారులో రివాల్వర్ని ఆ దరిదాపుల్లోనే పారేసి వుండాలని ఊహించాను. నిన్న రాత్రి ప్రొద్దు పోయాక తోటలోకి వెళ్ళి వెదికాను. రివాల్వర్ ఒక పొదలో దొరికింది. అది పరాత్పరరావుగారిదే! ఆయన రివాల్వర్తోనే ఆయన కొడుకుని కాల్చారు. అంటే అగంతకుడు ఆ ఇంట్లో వ్యక్తే అయివుండాలని ఊహించాను ఆ విషయమే చెబుదామని వెళ్ళాను. అంతలో ఈఘోరం జరిగింది."

"నిన్ను చూడంగానే ఆయన కోపంతో అరిచి వుంటాడు. నీవూ రెట్టించివుంటావ్! దాంతో ఆయనకు గుండెపోటు వచ్చింది."

"నేనేం రెట్టించలేదు. నా భర్త స్వస్థత చిక్కే దాకా నన్ను ఈ యింట్లో వుండనివ్వమని బ్రతిమలాడాను అంతే!"

"ఇన్స్పెక్టర్ గారూ! ఆమెను వెంటనే అరెస్టు చేయండి! లేకపోతే అందరి కళ్ళు గప్పి పారిపోగల నెర జాణ అది!" అంది మాధురి ఈసడింపుగా.

"మా బాధ్యతల్ని ఒకళ్ళు గుర్తుచేయవలసిన పనిలేదు!" ఇన్స్పెక్టర్ కోపంగా మాధురివంక చూశాడు.

"ఇల్లంతా గాలించండి! ఇంజెక్షన్ బాటిల్, సిరెంజీ దొరికితే ఈ నాటకానికి తెర దిగుతుంది" కానిస్టేబుల్స్ని పురమాయించాడు ఇన్స్పెక్టర్.

"అయ్యా! ఇన్స్పెక్టర్ గారూ! దయచేసి లక్ష్మణరావు దగ్గిర గట్టి బందోబస్తు ఏర్పాటు చేయండి! ఆ హంతకు డెవరో ఆయన కే హాని తలపెట్టకుండా!" డాక్టర్ శేఖరం కలుగజేసుకున్నాడు.

లక్ష్మణరావు గదిలో కోమలి, సరళ మాత్రం వుండేం దుకు అనుమతించబడింది. గది బయట పోలీసు కాపలా ఏర్పాటు చేయబడింది.

9

లక్ష్మణరావుకి ఏవో మందులు కావల్సివుంది. డాక్టర్ శేఖరం సిటీకి వెళ్ళాడు, పరాత్పరరావు లాయరునుంచి వీలునామాను తెచ్చేందుకు.

మందుకోసం సరళ వెళ్ళవలసివచ్చింది. పోలీసుల అను మతి తీసుకుని బయలుదేరింది.

రోడ్డమ్మట కొంత దూరం నడిచాక, వెనుకనుంచి కారు వచ్చి ఆగింది. వివేకానంద కారుని నడుపుతున్నాడు.

"నేనూ టౌన్లోకే వెళ్తుంట! కారులో ఎక్కు!" అన్నాడు. సరళ కారులో ఎక్కి కూర్చుంది.

మందుల షాపు ముందు కారు ఆగింది. ఇద్దరూ షాపు లోకి వెళ్ళారు. సరళ మందుల్ని తీసుకుంది.

తర్వాత కారు ఒక హోటల్ ముందు ఆగింది. ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

"ఇంతకీ పరాత్పరరావుని హత్య చేసేందుకు మోటివ్

ఎవరికి వున్నదో అంతుపట్టలేదు. ఆయన వ్రాసిన వీలునామా లోని వివరాలు తెలిస్తే, ఈ కేసు కొంతవరకూ అంతుబట్ట వచ్చు" సరళ కూల్ డ్రింక్ త్రాగుతూ అంది.

"సీవు తెలీదల్లేవుంది. ఆయన విల్లులో వ్రాసిన విష యాలు నాకూ, డాక్టర్ శేఖరానికి ఎప్పుడో తెలుసు."

"అలాగా! ఎవరెవరికి ఏ మాత్రం వ్రాశారో?"

"డాక్టర్ శేఖరానికి యాభైవేలు. వాళ్ళిద్దరూ చిన్నప్పట్నించీ స్నేహితులట. మిసెస్ శేఖరమే మొన్న మొన్నటిదాకా ఆ ఇంటి యజమానురాలిలా ప్రవర్తించేది. పరాత్పరరావుతో అక్రమసంబంధం వున్నదనికూడా ఒక వదంతి. మాధురి వచ్చాక మిసెస్ శేఖరం ఆట కట్టిందట."

"ఆ తీపిమీద డాక్టర్కి యాభైవేలు యిచ్చాడన్న మాట!"

"అవును. నౌకరు కన్నయ్యకూ, కేశయ్యకు చెరో మూడువేలు. లైబ్రరీ రూంలోని కాశ్మీరు తివాసీ మ్యాజి యంకి బహూకరించాడు. ఊళ్ళో ధర్మసత్రానికి కొంత మిగతా ఆస్తిని భార్య మాధురి, కొడుకు లక్ష్మణరావులకు చెరిసగం పంచాడు."

"అయితే ఆ యింట్లో అందరికీ కాస్తో కూస్తో ముట్ట చెప్పాడన్నమాట! కానీ మాధురి తమ్ముడు మధుమూర్తికేం యిచ్చినట్టు లేదే?"

"పరాత్పరరావు బ్యాంకు ఎకౌంట్ పరిశోధించగా తెలిసిన విషయం ఏమిటంటే, పదిహేను ఇరవైరోజుల వ్యవధిలో మధుమూర్తి పేర పెద్ద మొత్తంలో చెక్కు లిచ్చాడు. అంటే అందులో ఏదైనా బ్లాక్ మెయిల్ వ్యవ హారం వుందా అని పోలీసులు అనుమానిస్తున్నారు."

డ్రింక్స్ త్రాగడం పూర్తిచేసి యిద్దరూ బయలుదేరారు. మూడువంతులు దూరం రాగానే, కారు ఆగిపోయింది. బోనెట్ ఎత్తి పరీక్షించాడు వివేకానంద్. "కారు చెడి పోయింది. ఎలాగ? పోనీ నీ వొక్కదానివీ వెళ్ళగలవా?"

"అలాగే వెళ్తాను. నాకేం భయంలేదు" సరళ బ్యాగ్ చేతిలో పుచ్చుకుని బయలుదేరింది.

10

రోడ్డు మెలికలు మెలికలు తిరుగుతోంది. రోడ్డు కిరు ప్రక్కలా చెట్లున్నాయ్. సూర్యుడు అప్పుడు అస్తమిం చాడు. చీకట్లు అలుముకుంటున్నయ్. అరగంట నడిచి బంగళాకు చేరువయింది సరళ.

దగ్గరగదా అని తను ఈ రోడ్డుదోవన పడింది. తీరా వచ్చేక గానీ తెలీలేదు. చీకటిలో నిర్జనమైన ప్రదేశంలో ఒంటరిగా స్త్రీ వెళ్ళటం ఎంత ప్రమాదకరమైనది అను కుంది సరళ.

ఎక్కడో ఎండుటాకులమీద ఎవరో నడిచినట్టుగా అలికిడి అయింది.

సరళ నిలబడిపోయింది. "ఎవరది?" అని అరిచింది, మేకపోతు గాంభీర్యంతో. బదులు రాకపోవడంతో మళ్ళీ బయలుదేరింది.

చుట్టుప్రక్కల కలయ జూసుకుంటూ భయంతో బిక్కు బిక్కుమంటున్న సరళ కాళ్ళకు ఏదో అడ్డుతగిలింది. ఆమె తూలి క్రిందపడబోయింది. ఎలాగో తమాయించుకున్నది.

ఏదో మూటలాంటిది పడివుంది రోడ్డుకడ్డంగా. దాన్ని తడిమి చూసింది సరళ. చేతికి తడి తగిలింది. ఆ తడి ఆమెకు చిరపరిచితమైనదే, నర్స్ పనిలో. అది రక్తం!

సరళ ఆ మాటను తప్పాకని పరుగుదీసింది. పది నిము షాల్లో బంగళా గేటుదగ్గరకు వచ్చిపడింది.

ముందు తోటలో తిరుగుతున్న పోలీసులకు చెప్పింది సరళ.

"డొంకదోవలో ఎవరిదో శవం పడివుంది."

"మైగాడ్! మరో హత్యా! ఇంతమంది పోలీసులు యిక్కడ వుండగానే!"

ఈ వార్త బంగళా అంతటా వ్యాపించిపోయింది. జనం డొంకరోడ్డుమీదకు పరుగులు తీసింది.

అప్పుడే కారులో వివేకానంద్ వచ్చాడు "ఏం జరిగింది? ఏమయింది? అనడిగాడు."

"ఏమిటి సరళా! నీ చేతులకు రక్తం ఏమిటి?" అడిగింది మాధురి.

"ఆ చీకట్లో అతడి శవం తగిలి పడబోయాను. నా చేయి అతడి శవం మీద అనింది!" సరళ బదులు చెప్పింది.

"ఛీ! ఛీ! ఈ నర్సులిద్దరూ వచ్చారు. స్వర్గధామం లాంటి ఈ బంగళాలో మృత్యువు విలయ తాండవం చేస్తున్నది. హత్యల మీద హత్యలు జరుగుతున్నయ్."

పోలీసులు వెళ్ళి శవాన్ని తెచ్చారు. అది డాక్టర్ శేఖరానిది. అతడ్ని చంపే అవసరం ఎవరికి కలిగివుండా లని అందరూ విస్తుపోయారు.

డాక్టర్ శేఖరం చాలా దారుణంగా హత్య చేయ బడ్డాడు. గొంతుదగ్గర నరాలు కత్తితో తెగకోయబడి, అతడు చనిపోయాడు. ఎంతటి కసికల కసాయివాడయినా అంత దారుణంగా చంపడు.

11

ఆ మధ్యాహ్నం పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రత్యేకంగా మనిషి వచ్చాడు. రిజిస్టర్డ్ పార్సిల్ ఎవరో పంపారట పోలీస్ స్టేషన్‌కి. అందులో ఇంజెక్షన్ సిరంజీ, మందుసీసా వున్నయ్. ఆ రెండింటి మీద కోమలి చేతి వేలిముద్రలు వున్నట్టుగా పరీక్షలో తేలినయ్యట.

కోమలి పరాత్పరరావుకి విషాన్నిచ్చి చంపిందనే అభియోగంతో, ఆమెపై అరెస్టు వారెంటు ఇవ్వబడింది.

అయితే యిల్లంతా వెదికినా కోమలి కనుపించలేదు.

మరి కోమలి ఏమయినట్టు? సరళ ఆకులా వణికి పోయింది.

ఇన్స్‌పెక్టర్ చుట్టుపట్ల పోలీసు స్టేషన్‌కు మెస్సేజ్ పంపాడు, కోమలి కొరకై గాలించమని.

ఆలోచించిన కొద్దీ సరళకు భయంకర పరిణామాలే తోస్తున్నయ్. లక్ష్మణరావుని కాల్చిన హంతకుడు, పరాత్పరరావుని బలిగొన్న హంతకుడే ఆమెనూ అంతం చేశాడా? అందువల్ల అతడికి కలిగే లాభం ఏమిటి? తను చేసిన హత్యవల్ల కోమలి నేరస్థురాలిగా ఆరోపింపబడింది. కనుక కోమలి ఉరికంబం ఎక్కితే, హంతకుడు నిక్షేపంలా బ్రతికి బయటపడతాడు.

సరళ ఆలోచనల్లో పడి తనకు తెలియకుండానే బంగళా నుంచి చాలా దూరం నడిచివచ్చింది. బంగళాకు ఒక మూలగా చాల దూరంలో అదే ఆవరణలో గ్యారేజీ వుంది.

గ్యారేజీ తలుపులు దగ్గరగా వేసివున్నాయ్. తాళం వేసిలేదు. చప్పుడు కాకుండా తలుపు తెరుచుకుని లోపలకు వెళ్ళింది సరళ.

అదే సమయంలో గ్యారేజీ లోపలగా ఒక మూల తలుపు తెరుచుకుంది. సరళ పాతసామానుల వెనుక నక్కింది.

ఆ తలుపు గోడకున్నది కాదు. నేల మాళిగలోకి దారి తీసేది. అందులోనుంచి పనిమనిషి సుబ్బులు వచ్చింది. గ్యారేజీ తలుపు తెరుచుకుని బయటికి వెళ్ళిపోయింది. ఆమె చేతిలో స్టీలుగిన్నె వుంది.

బహుశా, లోపల ఎవరో బంధింపబడివుంటారు. వారికి ఆహారాన్ని తీసుకువెళ్ళేందుకు వచ్చింది సుబ్బులు.

సరళ నేలమాళిగ తలుపు తెరుచుకుని మెట్లు దిగి లోపలకు వెళ్ళింది. నేల అడుగున రహస్య మందిరం అది. అందులో మూడు గదులున్నాయ్. రెండు బెడ్ రూమ్‌లూ, ఒక డ్రాయింగ్ రూమ్.

ఆమె డ్రాయింగ్ రూమ్‌లో అడుగు పెట్టిందో, లేదో గ్యారేజీ తలుపు నెవరో తెరుస్తున్నట్టుగా అలికిడయింది. గోడవారగా వున్న కర్టెన్ల వెనుక నక్కింది సరళ. దొంగ చాటుగా నక్కి చూడసాగింది.

మరికొద్ది క్షణాల్లో మాధురి వచ్చింది అక్కడకు. ఆమె గదిలోకి వచ్చిన ఒక్క క్షణం తర్వాత ఆమె తీవ్రమైన కంఠం వినిపించింది.

"చాటుగా వచ్చావన్న మాట పొంచి పొంచి చూస్తూ!"

సరళ ప్రైప్రాణాలు పైనే పోయినయ్. తన రాకను మాధురి అప్పుడే పసిగట్టిందన్న మాట!

అంతలోనే మరో మగగొంతు వినిపించింది.

"నీ తమ్ముడ్నే కదూ? నీ రహస్యాలు ఎప్పటికప్పుడు

నేను తెలుసుకుంటూ ఉండాలి!" కంఠం మాధురి తమ్ముడు మధుమూర్తిది.

"అందువల్ల నీకేం లాభం?"

"పరాత్పరరావు రహస్యాలు తెలుసుకున్నందుకే కదా నాకు నెలనెలా పెద్దమొత్తంలో డబ్బు అందింది!"

"అవునూ! పోలీసులు ఆ విషయం అడగలేదా?"

"అడిగారు. ఇంటి ఖర్చులకని డబ్బు వాడమని ఇచ్చాడని చెప్పాను. వాళ్ళు నా మాటలు నమ్మారు. అప్పుడు యింటి యజమానివి నీవే కదా? ఇక నీనుంచి నేను డబ్బు రాబట్టుకోవాలి నా ఖర్చులకు."

"ఇంకా నా చేతికి తాళాలు రాలేదుగదరా?"

"అక్కా! నా దగ్గరకాదు నీనగలు. బ్యాంకి ఎకౌంట్ భార్యాభర్తల జాయింటు పేరిటవుంది. బావగారు లేరు గనుక దాన్ని నీవే ఆపరేట్ చెయ్యొచ్చు."

"నీకు ఒక్క పైసా యివ్వను అరిచి చచ్చినా!"

"అప్పుడు నీవే జైలుపాలవుతావ్! ఆస్తి అంతా లక్ష్మణరావు పరం అవుతుంది. అందుకని నాకు రెండు లక్షలు పారేయ్. నా దోవన నేను పోతాను."

"అసలు నేను ఎందుకివ్వాలి?"

"అక్కా నీవు నా రక్షణలో వున్నప్పుడే కదా, నిన్ను నేను లక్ష్మణరావుకి పరిచయం చేసింది? నీవు అతడ్ని పెళ్ళాడి, మన దారిద్ర్యాన్ని తొలగిస్తావని ఆశించాను. కాని లక్ష్మణరావు ఆ నర్సుని పెళ్ళాడాడు.

"ఏదో రకంగా ఈ బంగళాకి అధికారివి కావాలని నీవు పంతంపట్టి ముసిలాయన పరాత్పరరావునే పెళ్ళాడి కోటలో పాగా వేశావ్. అయినా నీకు లక్ష్మణరావుపై

ఆశ చావలేదు. అతడ్ని వలలో వేసుకోవాలని చూశావ్.

"తోటలో రాత్రిపూట అతడ్ని కలుసుకున్నావ్. ఈ విషయం పసిగట్టిన పరాత్పరరావు పిస్టల్ తెచ్చి పొద చాటున వుండి కాల్చాడు. ఈ ప్రమాదాన్ని ముందే ఊహించి, నీవు లక్ష్మణరావు చాటుకు తప్పించుకున్నావ్. రివాల్వర్ బుల్లెట్ లక్ష్మణరావు భుజంలో దిగబడింది."

"పోరా పోకిరి వెధవ! నీ కట్టుకధలు ఎవరు నమ్ముతారు?"

"నీవు అలా అంటావని నాకు తెలుసు. ఇంటికి కొత్తగా వచ్చిన వివేకానంద్ అందగాడు. యువకుడు, స్ఫురద్రూపి అతడ్ని మురిపించి నీ వాంఛల్ని తీర్చుకుంటున్నావ్ అతడితో. మీ యిద్దరూ కలిసివున్నప్పుడు రహస్యంగా ఫోటోలు తీశాను కూడా!"

"అయితే నీకు రెండు లక్షలు యివ్వాల్సిందేనంటావ్?"

"పోనీ ముందు ఒక లక్షన్నా యివ్వు. మరో లక్ష తర్వాత ఇద్దువు!"

తర్వాత మాధురి, మధుమూర్తి ప్రక్క గదిలోకి వెళ్ళి వచ్చారు. ఆ తర్వాత ఇద్దరూ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయాక సరళ ప్రక్క గదిలోకి వెళ్ళింది. బెడ్ మీద కోమలి పడివుంది. ఆమె స్పృహలో లేదు.

మళ్ళీ ఎవరో వస్తున్న అలికిడి అయింది. సరళ ఒక మూల నక్కింది. ఆమె కూర్చున్నచోట టేబుల్ మీద రివాల్వర్ కనుపించింది, దాన్ని అందుకుని రెడీగా చేతులో పెట్టుకుని నిరీక్షించసాగింది.

మళ్ళీ సుబ్బులు వచ్చింది.

సరళ రివాల్వర్ గురి చూపుతూ పైకి లేచింది.

రివాల్వర్ చూస్తూనే సుబ్బులు గజ గజ వణికి పోయింది.

"నన్ను కాల్చద్దు! కావాలంటే నన్ను పోలీసులకు అప్పజెప్పు! దీనికంతకూ నాకూ బాధ్యతవుంది."

"ఇప్పటికయినా నీ నాటకాలు కట్టిపెట్టి నిజం చెప్పు· తిన్న యింటి వాసాలే లెక్క పెడతావా?"

"అవునమ్మా! నాదే పొరబాటు! మాధురి ఇచ్చిన డబ్బుకు కక్కుర్తి పడి ఆమె చెప్పినట్టు చేశాను. పోలీసులకు ఫోన్ చేసింది నేనే! వాళ్ళకు పార్సిల్లో మాధురి పంపమంటే ఇంజెక్షన్ సీసా, సిరెంజ్ నీ పంపింది నేనే."

. "అయితే పద! పోలీసులకు నిజాన్ని చెప్పి, నిర్దోషుల్ని రక్షించాలి! నడుముందు!" సరళ బెదిరించింది రివాల్వర్ ని ఊపుతూ.

సుబ్బులు ముందు నడుస్తున్నది. సరళ ఆమె వీపుకి రివాల్వర్ ని అనించి నడుస్తున్నది.

కోమలి గది తలుపులు దాటగానే, ఎదురుగా మాధురి నిప్పులు గ్రక్కుతూ నిలబడింది. ఆమె చేతిలో కత్తి తళ తళ మెరుస్తున్నది.

సుబ్బులు ఏడుస్తూ నిలబడింది.

"ఓ! నీ స్నేహితురాల్ని వెతుక్కుంటూ వచ్చావా నర్స్!"

"కోమలి నీకేంఅపకారంచేసింది?ఆమెపై పగబట్టావ్?"

"లక్ష్మణరావుని నాకు కాకుండా చేసింది. నాకు దక్కని వ్యక్తిని దానికిమాత్రం దక్కనిస్తానా?"

"మాధురీ! నీకు కావల్సింది ఐశ్వర్యం! పరాత్పరరావు మరణంతో దాన్ని సాధించావ్! ఇకనైనా నీ ఆవేశాన్ని శాంతింపజేయి!"

"అలా వీల్లేదు. కోమలి మాయమవటంతో పోలీసులు ఆమెను వెదకటంలో నిమగ్నులౌతారు. మాకు కొంత వ్యవధి వస్తుంది. ఈలోగా లక్ష్మణరావు హరీ అంటాడు. ఆస్తి అంతా నా వశం అవుతుంది. ఈ బంగళాని అమ్మేసి స్వేచ్ఛగా విహంగంలా వెళ్ళిపోతాను."

"నీవు పైకి అందగత్తెవే! కానీ లోపల నీవు పిశాచివి" అంటూ సరళ రివాల్వర్ ట్రిగ్గర్‌ని నొక్కింది.

ఆ రివాల్వర్‌లో బుల్లెట్స్ లేవని ఆమె గ్రహించలేదు. ట్రిగ్గర్ క్లిక్ మన్న శబ్దం తప్ప మరేం సంభవించలేదు.

మాధురి కత్తి పైకెత్తి ఆమెపై దూకింది. సరళ రివాల్వర్‌ని వెనక్కి తిప్పి ఆమె తలపై కొట్టింది. ఆ దెబ్బ తప్పుకునేందుకు మాధురి క్రిందకు వంగింది.

సరళ కాలితో మాధురి కడుపులో తన్నింది. ఆమె దొర్లుతూ వెళ్ళి పడింది నేలమీద.

సరళ ఆమెమీద పడి, మాధురి చేతిలోని కత్తిని లాక్కుంది,

మాధురి బెదిరిపోయింది. అంతలో ఎవరో వచ్చిన అలికిడి అయింది. తలెత్తి చూసింది సరళ.

ఆ వచ్చింది వివేకానంద్. అతడి ముఖాన విషపునవ్వు, కళ్ళల్లో క్రౌర్యం తాండవమాడుతున్నయ్.

అతడి బలమైన చేతులు సరళను చుట్టేసినయ్. కుక్కపిల్లను విదిలించినట్టుగా విదిలించేసాడు ఆమెను.

మాధురి బుసలుకొడుతూ లేచింది. "చంపేసెయ్ పీడా విరగడవుతుంది" అంది.

అంతలోనే తలుపులు తోసుకుని బిలబిలమంటూ పోలీసులు లోపలకు జొరబడ్డారు.

"హాండ్సప్!" అన్నాడా ఇన్స్పెక్టర్.

వివేకానంద్, మాధురి చేతులకు బేడీలు వేశారు.

12

లక్ష్మణరావు బెడ్ మీద కూర్చుని వున్నాడు. అతడికి ఆసరాగా వుంది కోమలి.

హాల్లో ఇంకా మధుమూర్తి, నౌకర్లు, సరళ, పోలీసులూ వున్నారు. ఒకమూల బేడీలతో వివేకానంద్, మాధురి వున్నారు.

"నర్స్ కోమలి ఈ అనర్థాలకన్నింటికీ మూలం అని అనుకున్నాం ముందు. కానీ ఐశ్వర్యంకోసం, వైరైటీల కోసం అంగలార్చే మాధురి అసలు కారణం అని చివరకు తేలింది.

"లక్ష్మణరావుని పెళ్ళాడాలని ఆశించిన మాధురి, ఆ అవకాశం చేయిజారిపోయిందని తెలిసి, మరో ఎత్తు వేసింది. తన వయసూ, సొగసులతో ముసలి యజమాని పరాత్పరరావుని వలలో వేసుకుంది. అతడ్ని పెళ్ళాడి ఈ ఇంటికి అధికారిణి అయింది.

"అయితే ఆమె లక్ష్మణరావుని తన కోర్కె తీర్చమని వేధించసాగింది. లక్ష్మణరావు తప్పుకు తిరుగుతున్నాడు.

"పరాత్పరరావుకి మరో వ్యాపకం ఉంది. ఎమర్జన్సీ విధింపబడ్డాక, 'ఆనందమార్గ్' సంస్థ నిషేధింపబడింది. పరాత్పరరావు ఆ సంస్థలో రహస్య సభ్యుడు. అనేకసార్లు ఆ సంస్థకు పెద్ద మొత్తంలో విరాళాలిచ్చి వున్నాడు. ఎమర్జన్సీ వచ్చాక అతడు డబ్బు పంపటం మానేశాడు. అతడ్ని వ్యక్తిగతంగా కలుసుకునేందుకు వివేకానంద్ వచ్చాడు.

"అతడికి కొద్దిరోజులపాటు ఆతిధ్యం ఇవ్వటానికి ఒప్పు కున్నాడు పరాత్పరరావు. ఇంట్లో అందరికీ అతడు తన చిన్ననాటి స్నేహితుడని పరిచయంచేశాడు.

"చీరల్ని మార్చినంత తేలికగా ప్రియులను మార్చే స్వభావం గల మాధురి కన్ను వివేకానంద్ పైన బడింది. సులువుగానే అతడ్ని తన వలలో వేసుకుంది. ఈ అక్రమ సంబంధం పరాత్పరరావు కంటబడింది. అతడిలో ప్రతీకార జ్వాలలు రేగినయ్.

ఆ రాత్రి వారిద్దరూ తోటలో కలుసుకుంటారని తెలిసి' రివాల్వర్‌తో అక్కడ పొంచి వున్నాడు. కానీ ఆ రోజు లక్ష్మణరావుకి నిద్రపట్టక తోటలో తిరుగుతున్నాడు. మాధురి వచ్చి అతడిపైనే తన వగలంతా ఒలకబోసింది. ప్రియ సంభాషణలు జరిపింది.

"చీకట్లో వివేకానంద్ బదులు లక్ష్మణరావు వున్నాడని గ్రహించని పరాత్పరరావు తన కొడుకునే కాల్చాడు. దాంతో వివేకానంద్ మేలుకున్నాడు. ఆ దెబ్బ తనపై వుద్దేశ్యింపబడిందని తెలుసుకున్నాడు.

పరాత్పరరావు తన కొడుక్కి ప్రమాదం కలగగానే తన మనసులోని రహస్యాన్ని డాక్టర్ శేఖరానికి మాత్రమే చెప్పాడు.

"వివేకానంద్ అసలు స్వరూపాన్ని బట్టబయలు చేసేం దుకు వీలులేదు. వాడెటూ జైలులోకి పోవటానికి సిద్ధమే! అంతవరకూ వస్తే, వాడు పరాత్పరరావు ఆనంద్ మార్గ్ సంస్థలో సభ్యుడని చెప్పక మానడు. దాంతో మీసా క్రింద పరాత్పరరావు జైలుపాలవ వలసివస్తుంది. తమ వంశానికి తీరని మచ్చవస్తుంది. అందుకే మళ్ళీ తగిన అదను

కోసం వేచివున్నారు వివేకానంద్ పై దెబ్బతీసేందుకు!

"అంతవరకూ పరిస్థితి విషమించేదాకా చేతులు ముడుచుకుని కూర్చునే వ్యక్తి కాదు వివేకానంద్. అతడి మనసు కంప్యూటర్‌లా పనిచేసింది. తనపై అనుమానం రాకుండా పరాత్పరరావుని వదిలించుకోవటానికి పెద్ద ప్లాన్ వేశాడు. దాంతో తనకు శత్రుపీడ తొలగిపోతుంది; అందం ఐశ్వర్యం గల మాధురి శాశ్వతంగా తనదవుతుంది.

"పరాత్పరరావుకి గుండెపోటు వస్తుందని తెలుసుకున్నాడు. అలా గుండెపోటు వచ్చినప్పుడల్లా ఇంజెక్షన్ వేసుకుంటాడు. ఆ ఇంజెక్షన్ సీసాలోకి పాయిజన్‌ని ఇంజెక్ట్ చేసి, దాన్ని యథాస్థానంలో వుంచేశాడు.

"అతడి అదృష్టంకొద్దీ, ఆ రాత్రే పరాత్పరరావుకి గుండెపోటు రావటం, అమాయకురాలైన కోమలి అతడికి ఇంజెక్షన్ ఇవ్వడం జరిగింది. పరాత్పరరావు మరణించాడు. ఎవరూ వివేకానంద్‌ని అనుమానించలేదు.

వివేకానంద్ అసలు స్వరూపం తెలిసిన మరో వ్యక్తి డాక్టర్ శేఖరం. చాటుగా వివేకానంద్‌ని కలిశాడు డాక్టర్. యజమాని మరణానికి నీవే కారణం అని ఆరోపించాడు. దాంతో వివేకానంద్ అతడ్ని దారుణంగా హత్య చేశాడు. ఆ టైములో ఎలిబీ సృష్టించుకోవటం కోసం కారులో టౌన్‌కి వెడుతూ, సరళనుగూడ తనతో తీసుకెళ్ళాడు.

"తిరిగి వచ్చేటప్పుడు కారు రిపేరని చెప్పి, సరళను దించేశాడు. ఆమె బంగళాకు అడ్డదారిన వెడుతుందని అతడికి తెలుసు. ఆ దోవలోనే డాక్టర్ శేఖరాన్ని అంత మొందించాడు వివేకానంద్.

"ఇక వివేకానంద్ కీ, మాధురికీ అడ్డు లేదు. ఈ స్థితిలో మాధురి మనసులో పురుగు తొలిచింది. లక్ష్మణరావు అడ్డు గూడ తొలగించమని వివేకానంద్‌ని కోరింది. ఆ తర్వాత ఆ ఆస్తినంతా అమ్మేసి క్యాష్ చేసుకుని, బొంబాయో, కలకత్తానో వెళ్ళి వివేకానంద్‌తో స్థిరపడాలనుకుంది.

"కానీ ఇంటినిండా పోలీసుబలగం వుంది. వాళ్ళను తాత్కాలికంగా మరలిస్తే, ఆ కొద్ది వ్యవధిలో లక్ష్మణరావుని కడతేర్చవచ్చు. అందుకే కోమలిని నేల మాళిగలో దాచేశారు. ఇందులో ఏదో మోసం వుందని మేము ఊహించాము. మాధురిని రహస్యంగా కనిపెడుతూ వచ్చాం.

"పాడుబడిన గ్యారేజీలోకి సుబ్బులూ, మాధురీ, వివేకానంద్ వెళ్ళటం చూశాం. మా అనుమానం నిజమయింది. అసలు హంతకుల్ని పట్టగలిగాం," ఇన్స్పెక్టర్ జరిగినదంతా వివరించాడు.

"మైగాడ్! ఇంకొక్క రోజు ఆగితే నేనూ హరీ అనేవాడ్నన్న మాట!" అన్నాడు లక్ష్మణరావు.

"అవును! పైకి అందంగా కనుపించే ఈ మాధురి' సాత్వికుడిలా అవుపించే వివేకానంద్ నివురు గప్పిన నిప్పులన్నమాట!" కోమలి అంది.

"కాదు!కాదు! మేకవన్నె పులులు! మాధురి మాయలో పడి, తమ సంస్థను విరాళిచ్చిన దాతనే హత్యచేశాడు వివేకానంద్. ఐశ్వర్యంకోసం బరితెగించిన స్వేచ్ఛకోసం మాధురి ఇన్ని ఘోరాలకు తలపడింది" సరళ పలికింది, వారిద్దరి వంకా కోపంగా చూస్తూ.

"ఏమయితేనేం? భగవంతుడు ఇప్పటికైనా ఈ ఇంటికి పట్టిన శనిని వదిలించాడు. నా భర్తను నాకప్పగించాడు,"

అంది కోమలి కళ్ళు తుడుచుకుంటూ.

"అవును కోమలీ! ఇదంతా నీ చలవే! అదృష్టం బాగుండబట్టి పెద్ద ముప్పు తప్పింది. అన్నట్టు చట్టప్రకారం విడాకులు పొందాం కదూ మనం! ఇప్పుడు మనం ఒకరి కొకరు ఏమీ కాము! కనుక మళ్ళి పెళ్ళి చేసుకుందాం! ఇన్స్పెక్టర్ గారూ! మా పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి!" లక్ష్మణరావు నవ్వాడు.

"ష్యూర్! ష్యూర్! తప్పకుండా వస్తాను. ఈలోపల వీళ్ళ పెళ్ళి కానిస్తాను," అంటూ నేరస్థుల్ని వెంటబెట్టుకు వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టర్.

"నేనూ వెళ్ళొస్తానే కోమలీ! మీ భార్యాభర్తలు చేరువ కావాలనే నా అభిమతం. అది నెరవేరింది. ఇక మీ మధ్యన నేనెందుకు?" అంది సరళ.

"అదేం వీల్లేదు. నా పెళ్ళిలో నీవు తోడిపెళ్ళికూతురివి. పెళ్ళయేదాకా నీవిక్కడ్నుంచి కదలటానికి వీల్లేదు," కోమలి ఆప్యాయంగా చూసింది.

ఆ మాటల్ని బలపరుస్తూ అక్కడున్నవారంతా కిలకిల నవ్వారు.

—: ఐపోయింది :—